# స్వచ్ఛం.. అచ్ఛంగా అమలు

- నూరుశాతం బహిరంగ మలవిసర్జనరహిత గ్రామాలుగా 218
- డిసెంబర్ నాటికి వందశాతం పూర్తి లక్ష్యం
- ఇప్పటికే రూ. 112 కోట్ల వ్యయం
- గాంధీజీ ఆశయాల వైపు అడుగులు

**ఈనాడు, ఏలూరు**

బహిరంగ మలమూత్ర విసర్జన రహితం.. ఇది ఇప్పటివరకూ ఓ స్వప్నం. గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం దిశగా ప్రభుత్వం చేపట్టిన దృఢ దీక్షతో ఆ స్వప్నం సాకారం కానుంది. అక్టోబర్ 2 నాటికి రాష్ట్రంలో అత్యధిక గ్రామాలను బహిరంగ మలమూత్ర విసర్జన రహిత గ్రామాలుగా, పట్టణాలుగా ప్రకటిస్తామన్న ప్రభుత్వ హామీలు పకడ్బందీగా అమలు చేయడంలో జిల్లా యంత్రాంగం ముందడుగు వేస్తోంది. దీనికోసం వివిధ పట్టణాలు, ఏలూరు నగరం అధికారులు, గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం, ఆయా ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, ప్రజలు సంయుక్తంగా కృషి చేస్తున్నారు.





ఈ చిత్రంలోనిది తణుకు మండలం దువ్వ వద్ద పంచాయతీ నిర్మించిన సామూహిక మరుగుదొడ్డి. మరో చిత్రంలో పచ్చగా అందంగా కనిపిస్తున్నది ఉండ్రాజవరం మండలం వేలివెన్నులో నిర్మించిన సామాజిక మరుగుదొడ్డి. ఈ రెండింటి వద్ద నిత్యం ఒక వ్యక్తి పహారా కాస్తుంటాడు. అదేవిధంగా దీనిని ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుతారు.

### 1.72 లక్షల నిర్మాణం లక్ష్యం

జిల్లాలో సుమారు 940 పంచాయతీలు ఉండగా వీటిలో మొత్తంగా 1.72 లక్షల వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించారు. దీనిలో భాగంగా 2015-16లో 27 వేలు, 2016-17లో 44 వేలు అంతకుముందు మరో 2 వేలు మొత్తంగా 73 వేల నిర్మాణం పూర్తిచేశారు. మరో 21,500 ప్రగతిలో ఉన్నాయి. డ్వామా అధికారులు కూడా 11,400 నిర్మించాల్సి దీనిలో **(మిగతా 2లో)**

# స్వచ్ఛం.. అచ్చంగా అమలు

**(మొదటిపేజీ తరువాయి)** ఇప్పటికి 2600 పూర్తి చేశారు. మొత్తంగా ఇప్పటికి వీటి నిమిత్తం రూ. 112 కోట్లు ఖర్చుపెట్టారు. మొత్తంగా ప్రగతిలో ఉన్నవి, ఇంకా నిర్మించాల్సినవి కలిపి లక్ష వరకూ నిర్మాణం జరపాల్సి ఉండగా వీటిని డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయడానికి అధికారులు శతవిధాలా కృషి చేస్తున్నారు.

## 218 పల్లెల్లో సంపూర్ణ స్వచ్ఛత

ఇప్పటికే జిల్లాలోని మొత్తం గ్రామాల్లో 218 పంచాయతీలు సంపూర్ణంగా స్వచ్ఛత వైపు అడుగేశాయి. అంటే ఇక్కడ అందరికీ వ్యక్తిగత మరుగుదొడ్లు కలిగి బహిరంగ మలమూత్ర విసర్జన రహిత గ్రామాలుగా రూపుదిద్దుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు కొద్దిరోజులుకిత్రం జిల్లాకు వచ్చినప్పుడు దీని కార్యాచరణను అధికారులకు గుర్తుచేశారు. దీంతో తొలి అడుగు బలంగా పడింది. గతంలో వ్యక్తిగత మరుగుదొడ్డికిచాలా తక్కువ వ్యయం అందించే వారు. ఈ వ్యయం కేవలం గోడలకే సరిపోయేది. సెప్టిక్‌ట్యాంక్, ఇతరాలకు ఏమాత్రం అక్కరకు వచ్చేదికాదు. దీనిని గుర్తించిన కేంద్రంలో భాజాపా, రాష్ట్రంలో తెదేపాలు నిధులను భారీగా పెంచింది. రూ. 7200 కేంద్ర ప్రభుత్వం, రూ. 7800 రాష్ట్ర ప్రభుత్వం మొత్తంగా రూ. 15 వేలు అందించింది. దీంతో నిర్మాణ పనులు కూడా వేగం అందుకున్నాయి. వివిధ గ్రామాలు, పట్టణాల్లో కూడా ప్రజాప్రతినిధులు తమతమ వార్డుల్లో వ్యక్తిగత మరుగుదొడ్డిలేని వారిని గుర్తించి వీరికి వారి వివరాలు సిద్ధం చేశారు. దీనికి ఎంత ఖర్చయిందనే వివరాలను క్రోడీకరించి దీనిప్రకారం నివేదికలు తయారు చేశారు. ఇలా జిల్లాలో పంచాయతీలు, గ్రామాలు, పట్టణాల్లో వార్డులు, నగరాల్లో డివిజన్లు వారీగా నివేదికలు సిద్ధమయ్యాయి. 2014 అక్టోబర్ 2న ప్రారంభమైన ఈ ఉద్యమానికి రెండేళ్లు నిండింది. అప్పట్లో రెండేళ్లకాలంలో రాష్ట్రాన్ని నూరుశాతం స్వచ్ఛత చేకూర్చుతామన్న ప్రభుత్వ హామీ ఆచరణ దిశగా ముందుకు కదులుతోంది. వీటిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అమరేశ్వరరావు 'ఈనాడు'తో మాట్లాడుతూ ఇప్పటివరకూ అందరి సహకారంతో కలెక్టర్ పర్యవేక్షణలో 218 పల్లెల్లో నూరుశాతం ఫలితాలు సాధించామన్నారు. డిసెంబర్‌లోగా జిల్లామొత్తం ప్రగతి సాధించడానికి నిర్విరామంగా కృషి చేస్తామన్నారు.



**నూరుశాతం మరుగుదొడ్లు నిర్మాణం పూర్తిచేసుకున్న ఏలూరుమండలం సత్రంపాడు గ్రామం**